క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన పంచాయతీ కార్యదర్శులు

సింగరాయకొండ: మండలంలోని సింగరాయకొండ, మూలగుంటపాడు, పాతసింగరాయకొండ, శానంపూడి, కలికవాయ, సోమరాజుపల్లి గ్రామాల పంచాయతీ కార్యదర్శులు శుక్రవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సింగరాయకొండలో ఎస్.సుబ్రహ్మణ్యం, మూలగుంటపాడులో కె.రామారావు, శానంపూడిలో సాంబశివరావు బాధ్యతలు చేపట్టగా, వీరు నెల్లూరు జిల్లా నుంచి బదిలీపై వచ్చారు. పాత సింగరాయకొండలో ఎ.శ్రీనివాసరావు, కలికవాయలో ఆంజనేయులు, సోమరాజుపల్లిలో ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. వీరు జిల్లాలోని వివిధ పంచాయతీల నుంచి బదిలీపై వచ్చారు. వీరి నియామకంతో మండలంలోని అన్ని గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శుల పోస్టులు భర్తీ అయ్యాయి.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

వెలిగండ్ల: ఉపాధి హామీ పథకం ద్వారా ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహం అందిస్తున్నట్లు ఎంపీడీవో టి.సుకుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా మామిడి, నిమ్మ, బత్తాయి, జామ, దానిమ్మ, సపోటా, మునగ పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన చిన్న, సన్నకారు రైతులు వారి పొలం పాస్‌బుక్‌లు, ఆధార్ కార్డు, చిన్న, సన్నకారు రైతుల వివరాలతో కూడిన పత్రాన్ని ఈ నెల 15వ తేదీలోపు ఉపాధి హామీ కార్యాలయంలో అందజేయాలన్నారు. సమావేశంలో ఏపీవో కె.వెంకటేశ్వర్లు, టీఏలు ఎం.మనోహర్, జోయల్ రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా విక్రయిస్తున్న మద్యం పట్టివేత

పీసీ పల్లి: అక్రమంగా విక్రయిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నాగేశ్వరరావు తెలిపిన వివరాల మేరకు.. పెద చెర్లపల్లిలో అనుమతి లేకుండా మద్యాన్ని విక్రయిస్తున్న పాలూరు చినకొండయ్యను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 8 క్వార్టర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్ నాగార్జునరెడ్డి

పామూరు: మండల తహసీల్దార్‌గా చిలకల నాగార్జునరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. వెలిగండ్ల తహసీల్దార్‌గా పనిచేస్తూ పామూరుకు బదిలీపై రాగా, ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేస్తున్న జ్వాలా నరసింహం కురిచేడుకు బదిలీ అయ్యారు. అదే విధంగా సీఎస్ పురం ఆర్ఐ బత్తుల మల్లికార్జున బదిలీపై పామూరు ఆర్ఐగా వచ్చారు. మండలంలో రెవెన్యూ, భూ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని నూతన తహసీల్దార్ నాగార్జునరెడ్డి తెలిపారు.

నీటి సమస్య పరిష్కారంపై దృష్టి


వార్డులో పర్యటిస్తున్న చైర్మన్ గఫార్, కమిషనర్ నారాయణరావు

కనిగిరి రూరల్: పట్టణంలోని అన్ని వార్డుల్లో నీటి సమస్య పరిష్కారానికి ప్రత్యేక ప్రణాళికలు చేపడుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ తెలిపారు. మున్సిపాలిటీలోని 8, 9 వార్డుల్లో శుక్రవారం చైర్మన్ గఫార్, కమిషనర్ డీఎంఎస్ నారాయణరావు పర్యటించారు. డీప్ బోర్ ద్వారా నీరు సరఫరా అవుతున్న పైప్ లైన్‌ను పరిశీలించారు. పబ్లిక్ కుళాయిల ద్వారా ప్రతి ఇంటికి నీరందేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శివ మాధవి, షఫీ ఆజాద్, శానిటరీ సెక్రటరీ నాగజ్యోతి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

టీటీడీ శ్రీవారి ఆలయానికి భూమిపూజ


ఆలయానికి భూమిపూజ చేస్తున్న నాయకులు, అధికారులు

సీఎస్ పురం (పీసీ పల్లి): మండల పరిధిలోని బోయమడుగుల పంచాయతీ బాలుపల్లిలో టీటీడీ సహకారంతో నూతనంగా నిర్మిస్తున్న శ్రీవారి ఆలయానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. ఎంపీపీ మూడమంచు వెంకటేశ్వర్లు యాదవ్, సర్పంచ్ చిరంజీవి ఆధ్వర్యంలో భూమి పూజ చేయగా, కోవిలంపాడు సర్పంచ్ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఈఓఆర్డీలు

సింగరాయకొండ: మండల ఈఓఆర్డీగా సుధాకర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బాపట్ల జిల్లా పర్చూరు మండలం నుంచి బదిలీపై రాగా, ఇక్కడ పనిచేస్తున్న ఈఓఆర్డీ ఎం.అంజలీదేవి జరుగుమల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. కాగా, జరుగుమల్లి ఈఓఆర్డీ శ్రీనివాసరావును బాపట్ల జిల్లా యద్దనపూడిలో నియమిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు నేస్తాలు.. ఆర్‌బీకేలు

- రైతు భరోసా కేంద్రాల ద్వారా అన్నదాతల వద్దకే ప్రభుత్వ సేవలు
- రాయితీలపై ట్రాక్టర్లు, విత్తనాలు, ఎరువులు
- ఈ క్రాప్ నమోదుతో నష్టపోయిన పంటలకు పరిహారం
- సకలం సమకూరుతుండటంతో ఆనందంలో అన్నదాతలు


రైతు భరోసా కేంద్రంలో యంత్ర సేవా పథకం పరికరాలు తీసుకుంటున్న బల్లిపల్లికి చెందిన లక్ష్మీ నర్శింహస్వామి రైతు గ్రూపు


ఆర్‌బీకేల్లో ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

కనిగిరి రూరల్:

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతే రాజయ్యాడు. గత టీడీపీ ప్రభుత్వంలో వ్యవసాయం దండగని రైతాంగానికి అన్ని విధాలుగా మొండిచేయి చూపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక రైతు సంక్షేమానికి పెద్ద పీట వేశారు. గ్రామ సచివాలయాల్లోనే రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకేలు) ఏర్పాటు చేసి రైతన్నకు ప్రభుత్వ సేవలను చేరువ చేశారు. రైతుకు కొండంత అండగా నిలిచారు. ఆర్బీకేలతో రైతుల కష్టాలకు చెక్ పెట్టారు. రైతుల ముంగిటకే విత్తనాలు, ఎరువులు, యంత్రాలు, వ్యవసాయ పనిముట్లు, అధికారుల సేవలు, వగైరా అందుబాటులోకి తెచ్చి అండగా నిలబడుతూ నేనున్నా అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తూ వ్యవసాయాన్ని పండుగ చేస్తున్నారు.


ఆర్‌బీకే నుంచి ట్రాక్టర్లలో ఎరువులు తీసుకెళ్తున్న రైతులు

కనిగిరి నియోజకవర్గంలో 96 ఆర్‌బీకేలు...

కనిగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 96 రైతు భరోసా కేంద్రాలున్నాయి. కనిగిరి మండలంలో 23, పామూరులో 19, సీఎస్ పురంలో 15, పీసీ పల్లిలో 13, వెలిగండ్లలో 12, హెచ్ఎం పాడులో 14 ఆర్‌బీకేలు ఉండగా.. వాటిలో దాదాపు 75 శాతం సొంత భవనాల నిర్మాణాలు జరిగాయి. ఇంకొన్ని నిర్మాణంలో ఉన్నాయి. ప్రతి ఆర్‌బీకేలో వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో పాటు గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్ సేవలందిస్తున్నారు. రాయితీపై ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, పచ్చిరొట్ట విత్తనాలు, సాగుకు అవసరమైన యంత్రాలు పంపిణీ చేస్తున్నారు. ఈ క్రాప్ బుకింగ్, పంట నష్ట పరిహారం వంటి సేవలు అందిస్తున్నారు. గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉంటూ కియోస్కోలో ఆన్‌లైన్‌లోనే రైతుల వివరాలు నమోదు చేస్తున్నారు. రైతులకు కావాల్సిన వాటిని ఆర్‌బీకేల్లోనే కియాస్కోలో నమోదు చేసుకుని నగదు చెల్లిస్తే బహిరంగ మార్కెట్ కంటే తగ్గువ ధరకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, వగైరా వారంలోపే ఇంటిముంగిటకు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. పంట ఉత్పత్తులు సైతం ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేస్తూ రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నారు. రైతులకు పంటల సాగుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో పంటల సాగుకు ఇబ్బందులు తప్పాయని రైతన్నలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వ్యవసాయ యాంత్రీకరణకు ప్రోత్సాహం...

యంత్ర సేవా పథకం కింద ఈ ఏడాది లబ్ధిపొందిన గ్రూపు వివరాలు...

గ్రూపు పేరు : లక్ష్మీనర్శింహస్వామి రైతు కస్టమర్ హైరీ సెంటర్ (సీహెచ్‌సీ) గ్రూపు, బల్లిపల్లి

పరికరాలు	సంఖ్య	పూర్తి ధర	50 శాతం రాయితీతో చెల్లించింది
ట్రాక్టర్	1	రూ.7,14,800	రూ.3,57,400
ట్రాలీ	2	రూ.4,80,00	రూ.2,40,000
2 ఎంబీ నాగలి	2	రూ.80,000	రూ.40,000
9 చక్రాల గొర్రులు	4	రూ.1,44,000	రూ.72,000
11 చక్రాల గొర్రులు	2	రూ.78,000	రూ 39,000

కనిగిరి మండలం బల్లిపల్లిలోని ఆర్‌బీకే పరిధిలో అందిన సేవలు...

ఆర్‌బీకే పరిధిలోని గ్రామాలు	9
ఈ ఏడాది రైతు భరోసా పొందిన లబ్ధిదారులు	664 మంది
రైతు భరోసా ద్వారా అందిన నగదు	రూ.89,64,000
కౌలు రైతులు	34 మంది

2021 నుంచి ఇప్పటి వరకు ఇచ్చిన ఎరువులు...

యూరియా	34.42 మెట్రిక్ టన్నులు
డీఏపీ	6 మెట్రిక్ టన్నులు
20:20, 0:13	18 మెట్రిక్ టన్నులు

ఈ ఏడాది ఖరీఫ్‌కు ఇండెంట్ పెట్టిన పచ్చిరొట్ట విత్తనాలు...

జనుములు	7 క్వింటాలు
జీలుగ	5 క్వింటాలు
పిల్లిపెసర	5 క్వింటాలు


బల్లిపల్లి ఆర్‌బీకేలో నిల్వ ఉన్న యూరియా

రైతాంగానికి మెరుగైన సేవలు



రైతాంగానికి ప్రభుత్వం ద్వారా ఉన్నత సేవలు అందిస్తున్నాం. ఈ ఏడాది ఖరీఫ్‌కు కావాల్సిన అన్ని రకాల ఎరువులు, విత్తనాలు, వగైరా అందించేందుకు చర్యలు తీసుకున్నాం. యాభై శాతం రాయితీపై యంత్ర పరికరాలు అందజేశాం. ప్రతి వారం పొలంబడి, రైతులకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. ఇప్పటి వరకు సబ్సిడీపై యూరియా 6 టన్నులు వచ్చింది. ఒక టన్ను పంపిణీ చేశాం. 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు 17 క్వింటాలు అందుబాటులో ఉన్నాయి. ఎరువులు, విత్తనాలు కావాల్సిన రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– బత్తుల వెంకట సుబ్బయ్య, గ్రామ వ్యవసాయ సహాయకుడు

ఆర్‌బీకేలతో రైతులకు అండగా నిలిచిన జగనన్న



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు ఎంతగానో దోహదపడుతున్నాయి. గతంలో ఏ ప్రభుత్వం ఇలాంటి సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకురాలేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతిగా నిలిచారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువుల, విత్తనాలు, యంత్రపరికరాలను రాయితీపై ఇంటి ముంగిటకే అందిస్తున్నారు. ఆర్‌బీకేల్లో వీఏఏలు రైతులకు అందుబాటులో సేవలందిస్తున్నారు. గతంలో ఎరువులు, విత్తనాలను ఆటోల్లో కనిగిరికి వెళ్లి తెచ్చుకోవాల్సి వచ్చేది. ఆర్‌బీకేలతో బాడుగ ఖర్చు, శ్రమ తగ్గింది. అంతేగాకుండా యంత్ర సేవా పథకం ద్వారా 11 రకాల వస్తువులను సుమారు రూ.50 లక్షల సబ్సిడీతో మా గ్రూపు సభ్యులు పొందాం.

– బాలమాలకొండారెడ్డి, లక్ష్మీనర్శింహస్వామి సీహెచ్‌సీ గ్రూపు కన్వీనర్

బన్నీని పరామర్శించిన ఎమ్మెల్యేలు బాలినేని, బుర్రా


బన్నీతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు బాలినేని శ్రీనివాసరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్


రాజాల ఆదిరెడ్డిని పరామర్శిస్తున్న బాలినేని

కనిగిరి రూరల్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్, తదితర నాయకులు శుక్రవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వైఎం ప్రసాద్‌రెడ్డి (బన్నీ)ని పరామర్శించారు. ఇటీవల బన్నీ కాలికి శస్త్ర చికిత్స జరిగింది. ఆ విషయం తెలుసుకుని అతన్ని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని బాలినేని, బుర్రా సూచించారు. బన్నీ తల్లిదండ్రులతో మాట్లాడి యోగక్షేమాలడిగి తెలుసుకున్నారు. తొలుత ఏఎంసీ చైర్మన్ వైఎం సరితా ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ శ్రేణులు కలిసి బాలినేని, బుర్రాను ఘనంగా సన్మానించారు.

రాజాల ఆదిరెడ్డిని పరామర్శించిన బాలినేని...

వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు రాజాల ఆదిరెడ్డిని కూడా బాలినేని శ్రీనివాసరెడ్డి పరామర్శించారు. అనారోగ్యంతో ఇంటికే పరిమితమైన ఆదిరెడ్డి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తలు పాటించి త్వరగా కోలుకోవాలని సూచించారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీలు దంతులూరి ప్రకాశం, అత్యాల జఫన్య, జెడ్పీటీసీ సభ్యులు దద్దాల నారాయణ యాదవ్, గుంట తిరుపతిరెడ్డి, ఓకే రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్, మాజీ ఎంపీపీ గాయం బలరాంరెడ్డి, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్దన్, మాణిక్యరావు, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు ఎస్.మోహన్‌రెడ్డి, ఏపీఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

బాలినేనికి బుర్రా ఘన స్వాగతం


బాలినేని శ్రీనివాసరెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్

కనిగిరి రూరల్: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి శుక్రవారం కనిగిరి వచ్చిన సందర్భంగా స్థానిక చెక్‌పోస్టు (వైఎస్సార్ విగ్రహం) వద్ద స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ ఘనంగా స్వాగతం పలికారు. తిరుమల తిరుపతి దేవస్థాన శేష వస్త్రం కప్పి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫార్, ఎంపీపీ ప్రకాశం, ఏపీఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, పార్టీ మండల అధ్యక్షుడు జీ బొర్రారెడ్డి, సంగు సుబ్బారెడ్డి, ఓకే రెడ్డి, వైస్ చైర్మన్ పులి శాంతి గోవర్ధన్, మాణిక్యరావు, గాయం బలరాంరెడ్డి, కౌన్సిలర్లు.. బాలినేని శ్రీనివాసరెడ్డిని దుశ్శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

పలు ఆలయాల్లో ఎమ్మెల్యే బుర్రా పూజలు


కాటంరాజు విగ్రహం వద్ద ఎమ్మెల్యే బుర్రా

కనిగిరి రూరల్: స్థానిక ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ శుక్రవారం పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కనిగిరి మండలంలోని బొట్టికిర్లపాడులో నాగారప్పమ్మ కొలుపుల తిరునాళ్లలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే పీసీ పల్లి మండలంలోని పాలేటిపల్లిలో గంగమ్మ తల్లికి పూజలు చేశారు. నూతనంగా స్థాపించిన కాటమరాజు విగ్రహం వద్ద నెల పొంగళ్లు నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎంసీ సభ్యుడు డాక్టర్ పెరుగు మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, వైస్ ఎంపీపీ చెరుకూరి సతీష్‌చౌదరి, రామనబోయిన శ్రీనివాసులు, వేల్పుల వెంకటేశ్వర్లు, దేవర వెంకటేశ్వర్లు, మేకల మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

పలు వివాహ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బుర్రా

హనుమంతునిపాడు/వెలిగండ్ల: కనిగిరి ఎమ్మెల్యే, టీటీడీ పాలకమండలి సభ్యుడు బుర్రా మధుసూదన్‌యాదవ్ హనుమంతునిపాడు, వెలిగండ్ల మండలాల్లో శుక్రవారం జరిగిన పలు వివాహ వేడుకల్లో పాల్గొని వధూవరులను ఆశీర్వదించారు. హనుమంతునిపాడు మండలంలోని దాసరిపల్లి, గొల్లపల్లి, దొడ్డిచింతల, తిమ్మారెడ్డిపల్లి, వెలిగండ్ల మండలంలోని జాళ్లపాలెం, గోకులం గ్రామాల్లో జరిగిన వివాహ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పాలన

- వైఎస్సార్ సీపీ కొండపి ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు


పొన్నలూరులో మహిళకు సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న వరికూటి అశోక్‌బాబు

పొన్నలూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమని కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. పొన్నలూరులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. నవరత్న పథకాలు ద్వారా గ్రామాల్లోని నిరుపేద కుటుంబాలు లబ్ధిపొందడంతో వారి జీవన స్థితిగతులు మెరుగుపడ్డాయన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్లను ఆయా పంచాయతీల్లో ప్రజలకు అందుబాటులో నిర్మించి కనీస మౌలిక వసతులను ప్రభుత్వం సమకూర్చిందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం అబద్ధపు హామీలు ఇచ్చి రైతులు, మహిళలతోపాటు అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందన్నారు. కానీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను 98 శాతం అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో జరగని అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలు మన రాష్ట్రంలో కనిపిస్తున్నాయన్నారు. జగనన్న కాలనీల ద్వారా ప్రజలకు సొంతింటి కలను నిజం చేస్తూ ఒకే చోట వందల కొద్ది గృహాలను నిర్మిస్తూ సరికొత్త గ్రామాలను రాష్ట్ర ప్రభుత్వం సృష్టించిందన్నారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జెడ్పీటీసీ బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కన్వీనర్ పల్నాటి వెంకటేశ్వరరెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ పిల్లి తిరుపతి రెడ్డి, సొసైటీ చైర్మన్ గొల్లపూడి రవణయ్య, లేళ్లపల్లి లింగయ్య, గడ్డం ప్రసాద్, మండవ మాధవ, బోడా మల్లికార్జున, పల్లపోతు బాలయ్య, వెంకటేశ్వర్లు, ముప్పరాజు చెంచయ్య, గడిపూడి వెంకటేశ్వర్లు, లింగంగుంట నరసింగరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలతో అనర్థాలు


మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

మర్రిపూడి: బాల్య వివాహాలను అరికట్టాలని చైల్డ్ ప్రొటెక్షన్ జిల్లా కోఆర్డినేటర్ కిరణ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం సచివాలయ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలను నెలలో కనీసం నాలుగుసార్లు మంగళ, శనివారంలోపు తనిఖీ చేయాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు పౌష్టికాహారం పూర్తి స్థాయిలో అందే విధంగా చూడాలన్నారు. గర్భిణుల్లో రక్తహీనతను నివారించేందుకు వైద్యసిబ్బంది ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సుచరిత, సచివాలయ సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆర్‌బీకేలు రైతులకు వరం

- వ్యవసాయశాఖ జేడీ శ్రీనివాసరావు

హనుమంతునిపాడు: రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరమని వ్యవసాయశాఖ జేడీ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన రైతు సలహా మండలి మండల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల కష్టాలు తీర్చేందుకు ఆర్‌బీకేలు ఏర్పాటు చేసిందని ఒక వ్యవసాయ సలహాదారుడిని నియమించిందని, రైతులు సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. కనిగిరి డివిజన్ ఏడీ వెంకటరమణ, ఏవో గోపీకృష్ణ, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గాండ్లపర్తి వెంకటేశ్వరెడ్డి, కన్వీనర్ యక్కంటి శ్రీనివాసులరెడ్డి, మాజీ ఎంపీపీ గాయం బలరామిరెడ్డి, మండల రైతు సంఘ అధ్యక్షుడు శ్యామల సాంబిరెడ్డి, రమణారెడి పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులే వాడాలి

పీసీ పల్లి: రైతులు పంటల సాగులో రసాయన ఎరువులు వాడకుండా సేంద్రియ ఎరువులే వాడాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని వర్మీకంపోస్టు ఎరువుల షెడ్డులను ఈవోఆర్డీతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. అనంతరం మండలంలో కొనసాగుతున్న వర్మీకంపోస్టు షెడ్డులను పరిశీలించి వాటి ప్రస్తుత స్థితిని అధికారులనడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ మల్లేశ్వరి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శివలింగ ప్రతిష్ఠ

పీసీ పల్లి: మండల పరిధిలోని పెదయిర్లపాడులో వెలసిన మహారుద్రపీఠంలో శుక్రవారం అంగరంగ వైభవంగా 108 శివలింగ ప్రతిష్ఠ జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో అతిపెద్ద సహస్ర శివలింగ మరియు పరివారదేవతల ప్రతిష్ఠ మహోత్సవం, ప్రథమ అష్టోత్తర 108 శివలింగాల ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరిగాయి. శివలింగాలకు పంచామృతాభిషేకం, యంత్రస్థాపన పూజలు నిర్వహించారు. భక్తులు 108 శివలింగాలను స్వయంగా ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 12వ తేదీ వరకు ప్రతిష్ఠ పూజలు జరుగుతాయని, చివరిరోజు హంపీ పీఠాధిపతి శ్రీ విరుపాక్ష విద్యారణ్య భారతీస్వామి దివ్య హస్తములతో మహాసహస్ర శివలింగ ప్రతిష్ఠ మరియు పరివార దేవతల ప్రతిష్ఠలు నిర్వహించడం జరుగుతుందని ఆలయ వ్యవస్థాపకుడు సుబ్బారావు తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా ఎరువులు

పీసీ పల్లి: మండలంలోని 13 రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు పంపిణీ చేసేందుకు సిద్ధం చేసినట్లు మండల వ్యవసాయాధికారి వెంకటస్వామి తెలిపారు. ఇప్పటికే 13 కేంద్రాలకు యూరియా, 013, 20-20 ఎరువులు చేరుకున్నాయని, కావాల్సిన రైతులు స్థానిక రైతు భరోసా కేంద్రాల్లో పొలం పాస్‌బుక్, ఆధార్ కార్డుతో సంప్రదించాలని ఆయన కోరారు.

పొగ విత్తనాలకు దరఖాస్తు చేసుకోండి

కొండపి: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలో 2023-24 పంట కాలానికి పొగ విత్తనాలు అవసరమైన రైతులు ఈ నెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని నిర్వహణాధికారి ఎస్.రామారావు శుక్రవారం తెలిపారు. వాణిజ్యపరంగా పొగనారు పెంచాలనుకునే రైతులు విత్తనాల కోసం పొగాకు బోర్డు పాస్‌బుక్ జిరాక్స్ కాపీని దరఖాస్తుతోపాటు బోర్డు కార్యాలయంలో ఇవ్వాలని సూచించారు. సిరి, ఎఫ్‌సీఆర్-15 రకాలు ఒక రైతుకు గరిష్ఠంగా 7 కేజీల విత్తనాలు ఇస్తామని తెలిపారు. పొగాకు బోర్డులో ఇచ్చిన రశీదు, రైతు పొగాకు బోర్డు పాస్ బుక్‌ను కందుకూరు సీటీఆర్ఐ కార్యాలయంలో చూపి విత్తనాలు పొందవచ్చని తెలిపారు. ఒక కేజీ పొగ విత్తనాల ధర సుమారు రూ.1600 వరకు ఉంటుందన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25431
కందుకూరు డివిజన్
90102 24456
Office mail : sakshiongads@gmail.com